ఖాళీల కొరత.. తీరని వెత

అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది భర్తీ ఎప్పుడో?

- పలుచోట్ల ఖాళీగా టీచర్, హెల్పర్ పోస్టులు
- పని భారంతో ఇబ్బందులు

పెగడపల్లి: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని చాలాచోట్ల పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. టీచర్, హెల్పర్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఆయా కేంద్రాల పరిధిలోని బాలింతలు, గర్భిణులు, పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్న కేంద్రాల నిర్వహణ బాధ్యతలను పక్కనే ఉన్న కేంద్రాల టీచర్లకు అప్పగించడంతో అదనపు పనిభారం పడుతోందని వాపోతున్నారు. టీచర్ ఉండి హెల్పర్లు లేని కేంద్రాల్లో కేంద్రం నిర్వహణతో పాటు హెల్పర్లు చేయాల్సిన పనులన్నీ టీచర్లే చేసుకోవాల్సి వస్తోంది. ఖాళీ పోస్టులు భర్తీ చేయకపోవడంతో పౌష్టికాహారం సక్రమంగా అందడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో సిబ్బంది, చిన్నారులు

జిల్లాలో..	
అంగన్‌వాడీ కేంద్రాలు	1,065
టీచర్ పోస్టుల ఖాళీలు	60
హెల్పర్ పోస్టుల ఖాళీలు	318

ప్రాజెక్టుల వారీగా ఖాళీల వివరాలు

ప్రాజెక్టు	టీచర్	హెల్పర్
జగిత్యాల	15	97
మెట్‌పల్లి	14	86
ధర్మపురి	19	86
మల్యాల	12	49

ప్రభుత్వానికి నివేదించాం



జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్, హెల్పర్ల పోస్టుల ఖాళీల వివరాలు ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసి అర్హత ఉన్నవారిని నియమిస్తుంది. ప్రస్తుతం ఖాళీగా ఉన్న స్థానాల్లో పక్కనున్న టీచర్లకు అదనపు బాధ్యతలు అప్పగించాం. వారు ఎలాంటి ఇబ్బంది లేకుండా కేంద్రాలను నిర్వహిస్తున్నారు.

– నరేశ్, జిల్లా సంక్షేమశాఖ అధికారి



కథలాపూర్: మండలంలోని సిరికొండ గ్రామంలో వైకుంఠధామం(శ్మశానవాటిక) వద్దకు వెళ్లే రోడ్డు సరిగా లేకపోవడంతో మృతుల అంత్యక్రియలకు హాజరయ్యే ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. మట్టిరోడ్డు ఎగుడుదిగుడుగా ఉండటం, రోడ్డుపైకి చెట్ల కొమ్మలు వేలాడుతుండటంతో ఇక్కట్లపాలవుతున్నారు. అధికారులు చొరవచూపి సిరికొండ శివారులోని తారు రోడ్డునుంచి వైకుంఠధామం వద్దకు వెళ్లే రోడ్డుకు మరమ్మతు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి:
రాజేందర్, ఉపాధిహామీ పథకం ఏపీవో, కథలాపూర్, సెల్ నంబర్: 94905 26814

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

క్లుప్తంగా

జిల్లాస్థాయి కబడ్డీ టోర్నీ విజేత పెగ్గెర్ల



విజేత జట్టుతో ఎస్సై నవీన్‌కుమార్, అసోసియేషన్ ప్రతినిధులు

కథలాపూర్: మండలంలోని పెగ్గెర్ల గ్రామంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో టోర్నీ నిర్వహించారు. జిల్లాస్థాయి కబడ్డీ జట్టు ఎంపిక కోసం పోటీలు నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు. ఈ టోర్నీలో కథలాపూర్ మండలం పెగ్గెర్ల జట్టు ప్రథమ, ధర్మపురి మండలం రాయపల్లి జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు గురువారం బహుమతులు అందించారు. ఎస్సై నవీన్‌కుమార్, కబడ్డీ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, కార్యదర్శి రఘుపతి, ప్రతినిధులు రాజు, భాస్కర్, మండల నాయకులు ప్రతాప్‌రెడ్డి, అంజయ్య, నర్సయ్య, బాలు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా లచ్చయ్య



నియామక పత్రం ఇస్తున్న విజయభాస్కర్

కథలాపూర్: ఆల్ ఇండియా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కథలాపూర్ మండలం గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన రెండ్ల లచ్చయ్య పటేల్‌ను నియమిస్తూ సంఘం రాష్ట్ర శాశ్వత అధ్యక్షుడు కొత్త విజయభాస్కర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. లచ్చయ్య జిల్లా, మండలస్థాయిలో బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేయడంతో రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర నాయకులకు లచ్చయ్య కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం సహాయ నిధితో పేదలకు లబ్ధి



చెక్కు అందజేస్తున్న సుజీత్‌రావు

మెట్‌పల్లి: ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం ఆర్థికంగా లబ్ధి చేకూరుస్తుందని పీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజీత్‌రావు పేర్కొన్నారు. ఇద్దరు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో అందజేశారు. పేదలను ఆదుకోవడం కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, నాయకులు రహీం, గంగాధర్, శ్రీకాంత్ తదితరులున్నారు.

ధర్మపురిని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించండి

ధర్మపురి: ధర్మపురి పుణ్యక్షేత్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని హైకోర్టు న్యాయవాది ఉమామహేశ్ గురువారం ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. నూతన మండలాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుపై వార్తలు వస్తున్నందున ధర్మపురి డివిజన్ ఏర్పాటుపై చొరవ చూపాలని పేర్కొన్నారు. ధర్మపురి రెవెన్యూ డివిజన్‌గా ఏర్పడితే బుగ్గారం, వెల్గటూర్, బీర్‌పూర్ మండలాల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. డివిజన్ ఏర్పాటుపై విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, కాంగ్రెస్ హయాంలోనైనా డివిజన్ ఏర్పాటు కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు.

18వ సారి రక్తదానం



రక్తదానం చేస్తున్న నాగరాజు

రాయికల్: రాయికల్‌కు చెందిన బొమ్మకంటి నాగరాజు గురువారం 18వ సారి రక్తదానం చేశాడు. మండలంలోని అయోధ్య గ్రామానికి చెందిన చెట్యాల నర్సుకు అత్యవసరంగా ఏ పాజిటివ్ రక్తం అవసరం ఉండటంతో నాగరాజు రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచాడు.

కల్యాణలక్ష్మి నిధులు మంజూరు

కథలాపూర్: మండలంలో 113 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి పథకం నిధులు మంజూరైనట్లు తహసీల్దార్ వినోద్ గురువారం తెలిపారు. ఒక్కొక్కరికి రూ.1,00,116 చొప్పున మొత్తం రూ.1,13,13,108 మంజూరయ్యాయని పేర్కొన్నారు. శుక్రవారం కథలాపూర్‌లోని ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని తెలిపారు.

సీనియర్ సిటిజన్లకు ప్రభుత్వం భరోసా

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



పుస్తకం ఆవిష్కరిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

కోరుట్ల: సీనియర్ సిటిజన్లకు కాంగ్రెస్ ప్రభుత్వం భరోసా ఇచ్చిందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. సీనియర్ సిటిజన్స్ పిలుపు మాస పత్రిక పుస్తకాన్ని గురువారం పట్టణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ సంక్షేమ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. నిరాధరణకు గురైన వృద్ధులు, తల్లిదండ్రుల కేసులను ప్రతీ రెవెన్యూ డివిజన్లలో ఆర్డీవోల ఆధ్వర్యంలో ట్రిబ్యునల్ ద్వారా త్వరితగతిన పరిష్కరిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు అశోక్‌కుమార్, ఉపాధ్యక్షుడు హన్మంతరెడ్డి, ఎండీ యాకుబ్, కోరుట్ల అధ్యక్షుడు పబ్బా శివానందం, రాజ్‌మోహన్ పాల్గొన్నారు.

కళానాయకుల కవాతు విజయవంతం చేయాలి



సమావేశంలో నాయకులు

కోరుట్ల: మాదిగలంతా జనవరి 3 నుంచి ఫిబ్రవరి 3 వరకు నిర్వహించే కళానాయకుల కవాతులో పాల్గొని విజయవంతం చేయాలని వెయ్యిగొంతు–లక్ష డప్పుల మహా ప్రదర్శన కమిటీ జిల్లా అధ్యక్షుడు మారంపల్లి శ్రీధర్ కోరారు. గురువారం పట్టణంలో మాట్లాడారు. 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణకు ఎమ్మార్పీఎస్ జెండాతో పోరాడుతున్న మంద కృష్ణ మాదిగ వెయ్యి గొంతు–లక్ష డప్పుల మహా ప్రదర్శన, కళానాయకుల కవాతుకు పిలుపునిచ్చారని పేర్కొన్నారు. 27న కోరుట్ల పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో కళానాయకుల సన్నాహక సమావేశం నిర్వహిస్తామని, రాష్ట్ర కోఆర్డినేటర్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి రామచంద్ర భరత్, ఎమ్మెస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి, మాదిగ కళా నాయకుల కవాతు రాష్ట్ర కోఆర్డినేటర్ ముక్కెర సంపత్ హాజరవుతారని పేర్కొన్నారు. కోరుట్ల నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల కవులు, రచయితలు, గాయకులు, డప్పు కళా బృందాల నాయకులు, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాదిగ సంఘాల మండల అధ్యక్షుడు ఎర్ర శంకర్, పట్టణ ఇన్‌చార్జి మోర్తాడ్ రాజశేఖర్, డివిజన్ ఇన్‌చార్జి వినోద్, మండల ఇన్‌చార్జి శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి వనతడుపుల అంజయ్య, నాయకులు పాల్గొన్నారు.

పేదింటి అమ్మాయి వివాహానికి సాయం



పుస్తెమెట్టెలు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

మల్లాపూర్: పేదింటి అమ్మాయి వివాహానికి మెట్‌పల్లి ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సాయం అందించారు. గురువారం మండలంలోని మొగిలిపేటకి చెందిన పేదింటి అమ్మాయి గడ్డం చిన్నుకి ట్రస్ట్ అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో వివాహానికి కావాల్సిన పుస్తెమెట్టెలు, స్టీల్ సామగ్రి, పట్టుచీర, వంటసరుకులు అందజేశారు.

రూ.15వేలు..

మేడిపల్లి: భీమారం మండలం గోవిందారం గ్రామానికి చెందిన రుద్రంగి సౌమ్య వివాహానికి బీఆర్ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో గురువారం రూ.15వేలు ఆర్థికసాయం చేసినట్లు మాజీ జెడ్పీటీసీ నేల్లుట్ల పూర్ణిమ ప్రభాకర్ తెలిపారు. గ్రామ అధ్యక్షుడు ఈరవేణి గంగాధర్, చీటి దిలీప్‌రావు, చీటి సతీశ్‌రావు, పరమేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బస్సు కింద పడి యువతికి గాయాలు

రాయికల్: బస్సు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కింద పడి ఓ ప్రయాణికురాలు గాయపడింది. మండలంలోని రేగుంట గ్రామానికి చెందిన అంజలి రాయికల్ నుంచి జగిత్యాల వెళ్లేందుకు పట్టణంలో బస్సు ఎక్కబోయింది. ప్రమాదవశాత్తు కింద పడటంతో గాయాలయ్యాయి. ఆమెను 108లో జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించి ఇంటికి పంపించారు.



దుబాయ్‌లో ఎల్లమ్మ బోనాలు

కోరుట్ల: దుబాయ్‌లో ఎల్లమ్మతల్లి బోనాల కార్యక్రమం వైభవంగా జరిగింది. రేణుక ఎల్లమ్మ యూఏఈ సంఘం ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా బోనాల పండుగ నిర్వహించారు. ఒగ్గు కళాకారుల లగ్గం పట్నం, నాగవెల్లి పట్నం తదితర కార్యక్రమాలు చేపట్టారు. వేడుకలకు పెద్ద సంఖ్యలో జనం హాజరయ్యారు. ఫోక్ సింగర్ మహేశ్, కోరెపు మల్లేశ్, సంజీవ్, రాజశేఖర్, భూమేశ్, అరుణ్, శేఖర్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలి

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



సూపర్ మార్కెట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యం

మల్యాల: యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గురువారం మండల కేంద్రంలో తాటిపల్లికి చెందిన యువకులు ఏర్పాటుచేసిన సూపర్ మార్కెట్‌ను ప్రారంభించారు. నాయకులు దొంగ ఆనందరెడ్డి, వెల్మ లక్ష్మారెడ్డి, వీరబత్తిని శోభారాణి, తిరుపతి, మ్యాక లక్ష్మణ్ పాల్గొన్నారు.

కార్మిక సమస్యలు పరిష్కరించాలి



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

జగిత్యాల: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ నాయకులు అన్నారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా టవర్ వద్ద జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సీపీఐ ఏర్పడి వంద సంవత్సరాలు అవుతుందని, ఇది కార్మికుల, శ్రమజీవుల పార్టీ అన్నారు. జిల్లా కార్యదర్శి వెన్న సురేశ్, వెన్న మహేశ్, దేవదాసు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



ప్రొసీడింగ్ పత్రాలు ఇస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

మల్లాపూర్: ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటా వివరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయ అభివృద్ధికి మంజూరైన ఎంపీ ల్యాండ్స్ నిధులు రూ.3లక్షల ప్రొసీడింగ్ పత్రాలను అందజేసి మాట్లాడారు. రాబోయే పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు గడపగడపకు వెళ్లి కేంద్ర పథకాలు, రాష్ట్ర అభివృద్ధికి అందిస్తున్న నిధుల గురించి వివరించాలని సూచించారు. ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ఎంపీ అర్వింద్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. యాదవ సంఘం మండల అధ్యక్షుడు సంగ గంగరాజం, గౌరవ అధ్యక్షుడు వెల్పుల రాజగంగరాజం, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు లవంగ శివకుమార్, పట్టణ అధ్యక్షుడు ముష్కరి రాజ్‌కుమార్, నాయకులు బండి స్వామి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చివేత



గుంతలు పూడ్చుతున్న వెంకటేశ్వర్‌రెడ్డి

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని గొల్లపల్లి వెళ్లే రహదారిలో హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద పెద్ద గొయ్యి ఏర్పడింది. ఎవరూ పట్టించుకోకపోవడంతో అటుగా వెళ్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి అనే వ్యక్తి తానే స్వయంగా గుంతను మట్టితో పూడ్చారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రూ.7లక్షలతో శిశుమందిర్ స్కూల్



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్

కోరుట్లరూరల్: మండలంలోని అయిలాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించే శ్రీ సరస్వతీ శిశు మందిర్ స్కూల్ భవన నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, భవన నిర్మాణానికి బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి రూ.7 లక్షల నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో శిశుమందిర్ ప్రతినిధి డాక్టర్ వేముల ప్రభాకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజేశ్, నాయకులు పిడుగు సందయ్య, ఇప్ప రాజేందర్, బద్దం తుక్కారెడ్డి, వెంకటస్వామి, అంబల్ల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

నృసింహుని సేవలో మాజీ ఎమ్మెల్యే



స్వామివారి ప్రసాదం అందజేస్తున్న అర్చకులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని గురువారం చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా ఆలయం పక్షాన సాధారణ స్వాగతం పలికారు. అర్చకులు వేద మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ స్వామివారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

బీఆర్ఎస్, బీజేపీ డ్రామాలను ప్రజలు నమ్మరు



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న నర్సింగరావు

మల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్, బీజేపీ నాయకులు చేస్తున్న డ్రామాలను ప్రజలు నమ్మరని కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు ముత్యంపేట, రాఘవపేట, నడికుడ, మొగిలిపేట, ఒబులాపూర్, వాల్గొండ, సిరిపూర్ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు, రైతులకు ఇచ్చిన హామీలన్నింటినీ సీఎం రేవంత్‌రెడ్డి నెరవేరుస్తుంటే బీఆర్ఎస్, బీజేపీలు అడ్డుపడుతున్నాయని దుయ్యబట్టారు. కిసాన్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ అంతడపుల పుష్పలతనర్సయ్య, వైస్ చైర్మన్ ఇట్టెడి నారాయణరెడ్డి, బాపురెడ్డి, పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న స్వాములు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్

గొల్లపల్లి: మండలంలోని భీంరాజ్‌పల్లిలో బొమ్మెన కుమార్, నరేందర్, ముక్తామణి గురుస్వాముల స్వగృహంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహోత్సవానిన అత్యంత వైభవంగా నిర్వహించారు. గురుస్వాములు నాగుల మల్యాల వీరాచారి, కట్ట సత్యనారాయణచారి, గందె వేణు, గంధం పరంధాములు ఆధ్వర్యంలో శ్రీగణపతి, సుబ్రమణ్యస్వామి, గౌరీదేవి, శ్రీచక్ర అర్చన, అయ్యప్పస్వామి అభిషేకం, మెట్లపూజ, జ్యోతి ప్రజ్వలన, కుంకుమార్చన చేశారు. శేషు గురుస్వామి ఆర్కెస్ట్రా విభావరి, అయ్యప్పస్వామి పేటతుల్లి ఆటలు, స్వాముల భజనలు నృత్యాలు, పాటలు ఆకట్టుకున్నాయి. జగిత్యాల, పెద్దపల్లి, వేములవాడ నుంచి స్వాములు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ కందుకూరి కృష్ణారెడ్డి, గాయకులు కిష్టంపేట రమేశ్‌రెడ్డి, గురుస్వాములు చొక్కారెడ్డి, బొమ్మ రాజేశం, వడ్లకొండ శివకుమార్, విజ్ఞితుల మహేశ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో పడిపూజ

మెట్‌పల్లి: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో గురువారం మహా పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గురుస్వాములు చక్రవర్తుల పురుషోత్తమాచార్యుల చేతులమీదుగా పూజ చేశారు. దీక్షాపరుల భజనలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, పీసీసీ డెలిగేట్ సభ్యుడు కల్వకుంట్ల సుజీత్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత, మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ పాల్గొన్నారు.